ప్రజాశక్తి
సోమవారం 26 ఫిబ్రవరి 2024
7

అల్లూరి సీతారామరాజు

పదో తరగతి మోడల్ టెస్ట్ విజయవంతం

ప్రజాశక్తి -జి.మాడుగుల : మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమోన్నత పాఠశాలలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు మోడల్ పబ్లిక్ పరీక్ష విజయవంతంగా నిర్వహించారు. 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి పాంగి కొండబాబు మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షలకు సన్నద్ధమయ్యే విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలంటే భయం పోగొట్టడమే లక్ష్యంగా ఈ పరీక్ష నిర్వహిస్తున్నామన్నారు. దీనిలో పాల్గొనడం ద్వారా ప్రధాన పరీక్ష రాయడమెలాగో విద్యార్థులకు అవగాహన కలుగుతుందన్నారు. అలాగే పోటీ పరీక్షలో పాల్గొనే వారికి ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. టెన్త్ పరీక్షల్లో మంచి గ్రేడింగ్‌తో ఉత్తీర్ణులు కావడం ద్వారా తమ భవిష్యత్‌కు బంగారుబాట వేసుకోవాలని, బాగా చదివి ఉన్నత స్థాయికి వెళ్ళాలని, పాఠశాలకు, మండలానికి, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని అన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షులు మల్లేష్ , నాయకులు భాస్కర్ పాల్గొన్నారు .

పర్యాటకులను కట్టిపడేస్తున్న అరకు పైనరీ సోయగం..!

అరకు పైనరీ ముఖద్వారం

- పైన్ చెట్ల అందాలతో మంత్రముగ్ధంగా ప్రకృతి అందాలు
- రూ.71 లక్షలతో అంజోడ సిల్క్‌ఫారం ఆధునికీకరణ
- ఆకర్షణీయంగా తీర్చిదిద్దిన అటవీ, పర్యాటకశాఖలు
- టివి, సినిమా, ప్రీవెడ్డింగ్ షూట్‌లకు నెలవైన ప్రదేశం

అంజోడ సిల్క్‌ఫారంలో ఏపుగా పెరిగిన పైన్ మొక్కలు

ప్రజాశక్తి -డుంబ్రిగుడ: ఆంధ్ర ఊటీగా ప్రఖ్యాతిగాంచిన అందాల అరకులోయలో బొర్రా గుహలు, చాపరాయి జలపాతంతో పాటు అంజోడ సిల్క్‌ఫారానికి ప్రత్యేకత ఉంది అరకులోని వారపుసంతకు కాసింత దూరంలోనే ఉన్న అంజోడ సిల్క్‌ఫారంలో సుమారు 20 ఎకరాల్లో ఎత్తైన పైన్ చెట్లు వద్ద శీతకాలంలో కురుస్తున్న మంచు ప్రత్యేక ఆకర్షణగా పర్యాటకులను కట్టిపడేస్తుంది. పర్యాటకుల వనభోజనానికి ప్రత్యేక ప్రదేశంగా అంజోడ సిల్క్ ఫారం గుర్తింపు కలిగి ఉంది.

ఈ సిల్క్‌ఫారాన్ని పర్యాటకులను మరింతగా ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ఎకో టూరిజం ద్వారా అటవీశాఖ ఆధ్వర్యంలో రూ.71 లక్షలతో పర్యాటకుల సౌకర్యాలతోపాటు ఆధునీకరణ పనులు చేపట్టింది. దీనికి అరకు పైనరీ అని పేరు పెట్టి, సిల్క్ పారం లోపల ఎంట్రన్స్ గేటు నుంచి రోడ్డు కిరువైపులా పూల తోటలు వేయడంతో పాటు పర్యాట కులు కూర్చుని సేదదీరేం దుకు, ఫోటోలు తీసుకు నేందుకు వెదురు కర్రలు, చెక్కలతో వ్యూ పాయింట్ల ను అందంగా తీర్చిదిద్దారు. పర్యాటకులు స్థానికంగా ఉండేందుకు గుడారాలతో పాటు క్యాంటీన్ సౌకర్యం ఏర్పాటు చేశారు. వేకువజామున పర్యాటకుల వాకింగ్, జాగింగ్‌కు వాకింగ్ ట్రాక్‌ను కూడా ఏర్పాటు చేశారు. ఆధునికీకరించిన సిల్క్ ఫారం లోపల చుట్టూ విద్యుత్ కాంతులను అమర్చడంతో రాత్రుల్లో సిల్క్‌ఫారం దేదీప్యమానంగా విరాజిల్లుతూ, ప్రకృతి ప్రేమికులను తన్మయుల్ని చేస్తుందనడంలో అతిశయోక్తి లేదు.

విద్యుత్ లైట్ల వెలుగులో అంజోడ సిల్క్‌ఫారంలోని కుటీరం

యువతకు ఉపాధి కల్పిస్తున్నాం

ఎకో టూరిజం కింద అంజోడ సిల్క్ ఫారంను అందంగా తీర్చిదిద్ది పర్యాటకులను ఆకర్షించడం ద్వారా పాటు స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాం. ఇక్కడ సౌకర్యాలను కల్పించడంతో పర్యాటక కేంద్రంగా ప్రత్యేక గుర్తింపు పొందింది. తద్వారా అటవీ శాఖకూ ఆదాయం సమకూరుతోంది.

– శ్రీనివాసరావు, అటవీశాఖ రేంజర్,అరకు

షూటింగ్‌లకు నెలవుగా...

ఆధునికీ కరించిన అంజోడ సిల్క్‌ఫారం, అరకు పైనరీలోని అందాల లొకేషన్లు టివి సీరియల్స్, సినిమాలతోపాటు ప్రీవెడ్డింగ్ షూట్‌లకు నెలవుగా మారాయి. విశాఖ కిరండోల్ రైల్వే ట్రాక్ కూడా దీన్ని ఆనుకుని ఉండడంతో, సిల్క్‌ఫారం అందాలకు మరింత అదనపు ఆకర్షణ దిద్దినట్లయి, పర్యాటకులను ఆకర్షిస్తోంది. ఇక్కడ ఫొటోలు, వీడియోలను తీసుకుని, వాటిని తమ జీవితంలో మధుర స్మృతులుగా ఉంచుకునేందుకు ప్రకృతి, పర్యావరణ ప్రేమికులతోపాటు సందర్శకుల తాకిడి రోజురోజుకూ పెరుగుతోంది. అరకులోయ అటవీ శాఖ కార్యాలయం ఆవరణలో మరో రూ.10 లక్షలతో పర్యాటకుల సౌకర్యార్థం వివిధ గుడారాలను నిర్మించారు.

సందర్శకుల కోసం సిద్ధంగా ఉన్న గుడారాలు

ఎపి జెన్‌కో ఉద్యోగులు, సెక్యూరిటీ సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న దృశ్యం

గంజాయి అనర్థాలపై అవగాహన

ప్రజాశక్తి -సీలేరు

జీకే వీధి మండలం సీలేరు ఏపీ జెన్కో కళ్యాణ మండపంలో గంజాయి అనర్థాలపై జిల్లా ఎస్‌పి మానసరెడ్డి ఆధ్వర్యాన ఆదివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మానసరెడ్డి మాట్లాడుతూ గంజాయి జోలికి వెళ్లొద్దని దీనివల్ల భవిష్యత్తు అంధకారం అవుతుందని పేర్కొన్నారు. గంజాయికి ప్రతి ఒక్కరు దూరంగా ఉండాలన్నారు. మద్యం సేవించి ఉద్యోగులు విధులకు వస్తే శిక్ష అర్హులవుతారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎపి జెన్‌కో సీలేరు కాంప్లెక్స్ ఎస్ఇ ప్రశాంత్ కుమార్, ఈఈ ప్రభాకర్, ఏపీ జెన్కో ఉద్యోగులు, సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.

డొంకరాయి పవర్ కెనాల్ నిర్వహణ పనులకు ప్రతిపాదనలు

ప్రజాశక్తి -సీలేరు

ఎస్ఇ ప్రశాంత్‌కుమార్

సీలేరు కాంప్లెక్స్ పరిధిలోని డొంకరాయి పవర్ కెనాల్ నిర్వహణ (మెయింటినెన్స్) చేపట్టేందుకు అనుమతులు కోరుతూ ఉన్నతాధికారులకు ప్రతిపాదన పంపామని సీలేరు కాంప్లెక్స్ ఎస్ఇ సివిల్ కేకేవి.ప్రశాంత్ కుమార్ వెల్లడించారు. స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ పోల్లూరు జల విద్యుత్ కేంద్రానికి కెనాల్ ద్వారా నీటిని సరఫరా చేసేందుకు పోర్‌బాయి నుంచి 16 కిలోమీటర్లు మేరకు నిర్మించిన పవర్ కెనాల్ ద్వారా నీటిని సరఫరా చేస్తున్నామని తెలిపారు. పవర్ కెనాల్ నిర్మించి 50 సంవత్సరాలు పైబడడంతో ఏపీ జెన్‌కో ఇంజనీర్లు నిరంతరం పెట్రోలింగ్ నిర్వహిస్తూ లోపాలు ఎప్పటికప్పుడు గమనించి చర్యలు చేపట్టడం జరుగుతుందని వెల్లడించారు. గతంలో రెండేళ్లకు ఒకసారి పవర్ కెనాల్ నిర్వహణ పనులు చేపట్టే వారమని, అయితే డ్యామ్ అండ్ సేఫ్టీ అధికారులు సూచనలు మేరకు ప్రస్తుతం ప్రతి ఏటా సమ్మర్ సీజన్‌లో మెయింటెనెన్స్ పనులు చేపట్టడానికి సర్వే నిర్వహించామని చెప్పారు. ప్రస్తుతం గోదావరి డెల్టా రబీ పంటలకు నీటి అవసరాల నిమిత్తం సీలేరు కాంప్లెక్స్ నుంచి విద్యుత్ ఉత్పత్తి నిలిపివేసినట్లు తెలిపారు. ఈ క్రమంలోనే కెనాల్ మరమ్మతు పనులకు సర్వే చేసి అంచనా వ్యయంతో కూడిన ప్రతిపాదనలు చీఫ్ ఇంజనీర్ బి.శ్రీధర్‌కి పంపించినట్లు చెప్పారు. ప్రతిపాదనలు ఆయన పరిశీలించి ఆమోదించి అనుమతులు మంజూరు చేసిన ఒకటి రెండు రోజుల్లో కెనాల్ రిచ్ వన్ రీచ్ టులో మరమ్మతు పనులు నిర్వహిస్తామని ప్రశాంత్ కుమార్ తెలిపారు.

ఇంటర్ పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

- జిల్లాలో 27 పరీక్ష కేంద్రాలు
- హాజరుకానున్న 13,245మంది విద్యార్థులు
- 297 మంది ఇన్విజిలేటర్ల నియామకం..
- రెండు ఫ్లయింగ్ స్క్వాడ్‌ల ఏర్పాటు
- సిసి కెమెరాల నిఘాతో పర్యవేక్షణ
- ఇంటర్మీడియట్ పరీక్షల

జిల్లా ప్రత్యేకాధికారి మద్దిలి వినోద్‌బాబు

ప్రజాశక్తి పాడేరు: అల్లూరి జిల్లాలో వచ్చేనెల ఒకటి నుంచి ప్రారంభం కానున్న ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు ఇంటర్మీడియట్ పరీక్షల జిల్లా ప్రత్యేక అధికారి మద్దిలి వినోద్ బాబు వెల్లడించారు. జిల్లాలోని పాడేరు రంపచోడవరం డివిజన్లలో ఇంటర్ పరీక్షల నిర్వహణకు సంబంధించి చేస్తున్న ఏర్పాట్లపై ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో వివరాలు వెల్లడించారు. వివరాలు ఆయన మాటల్లోనే....

ప్రశ్న: జిల్లాలో ఇంటర్ పరీక్షా కేంద్రాలు ఎన్ని?

జిల్లాలో 27 ఇంటర్ పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశాం. పాడేరు డివిజన్లో 17, రంపచోడవరం డివిజన్లో 10 కేంద్రాలను ఏర్పాటు చేశాం. విద్యార్థులకు సౌలభ్యంగా అన్ని మండల కేంద్రాల్లో ఇంటర్ పరీక్షా కేంద్రాలు ఏర్పాటు జరిగింది. జిల్లాలోని 22 మండలాలను 20 జోన్లుగా విభజించాం. ఈ ఏడాది కొత్తగా డుంబ్రిగడ మండల కేంద్రంలో ఇంటర్ పరీక్ష కేంద్రం ఏర్పాటు చేసాం.

జిల్లాలో ఎంతమంది విద్యార్థులు పరీక్ష రాస్తున్నారు?

ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులు 7400 మంది పరీక్షలకు హాజరు కానున్నారు. ఇందులో జనరల్ గ్రూప్స్ 6,013 మంది, ఒకేషనల్ విద్యార్థులు 1387 మంది ఉన్నారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 5845 మంది పరీక్షకు హాజరుకానున్నారు. ఇందులో జనరల్ 4807 మంది, ఒకేషనల్ 1038 మంది విద్యార్థులు ఉన్నారు. మొత్తంగా 13,245 మంది ఇంటర్ పరీక్షలకు హాజరు కానున్నారు.

పరీక్షల పర్యవేక్షణ ఏర్పాట్లు ఏంటి?

జిల్లాలోని 27 ఇంటర్ పరీక్ష కేంద్రాల్లో 297 మంది ఇన్విజిలేటర్లను నియమించాం. అలాగే ప్రతి పరీక్షా కేంద్రానికి ఒక చీఫ్ సూపరింటెండెంట్, ఒక డిపార్ట్‌మెంట్ అధికారిని నియమించాం.

ప్రశ్న : మాస్ కాపీయింగ్ నిరోధానికి చేపట్టిన చర్యలు?

పాడేరు, రంపచోడవరం డివిజన్లకు ఒక్కొక్కటి చొప్పున రెండు ఫ్లయింగ్ స్క్వాడ్‌లు ఏర్పాటు చేశాం రాజమండ్రి రంపచోడవరం నుంచి ఫ్లైయింగ్ స్క్వాడ్ల పర్యవేక్షణ జరుగుతుంది. ప్రతి పరీక్ష కేంద్రం లోనూ, ప్రతి గది వద్ద సిసి కెమెరాల నిఘా ఏర్పాటు చేస్తున్నాం. అలాగే పరీక్ష హాల్స్‌లోకి ఇన్విజిలేటర్లు, విద్యార్థులు ఎవరూ మొబైల్స్, ఇతర సాంకేతిక ఉపకరణాలను తీసుకెళ్లకుండా నిరోధిస్తూ చర్యల తీసుకుంటున్నాం.

కేంద్రాల్లో పూర్తి సౌకర్యాలు కల్పించారా?

పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేశాం. నేల మీద కూర్చుని పరీక్షలు రాయకుండా, అన్ని పరీక్షా కేంద్రాలో బెంచ్‌లు ఏర్పాటు చేస్తున్నాం. తాగునీరు, ఫస్ట్‌ఎయిడ్‌ను అందుబాటులో ఉంచుతున్నాం. ఇంటర్ పరీక్షలు రాసే విద్యార్థులు 10 నిమిషాలు ముందుగానే ఆయా పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని కోరారు.

వాలంటీర్లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు

వాలంటీర్లకు సేవా పురస్కారాలు

ప్రజాశక్తి-మారేడుమిల్లి

మారేడుమిల్లి ఎంపిడివో కార్యాలయం వద్ద ఆదివారం వాలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అనంత బాబు,ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి చేతులమీదుగా వాలంటీర్లకు సేవా మిత్ర, సేవ రత్న, సేవ వజ్రా, పురస్కారాలు ప్రదానం చేసి, వారిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ లలిత కుమారి, ఎంపిడిఒ పి.జయంతి, వైసిపి నాయకులు సత్తి సత్యనారాయణ రెడ్డి, జడ్పిటిసి, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

దాహార్తిని తీర్చండి మహాప్రభో..!

ఖాళీ బిందెలతో గిరిజన మహిళల వినూత్న నిరసన

ఖాళీ బిందెలతో నిరసన తెలియజేస్తున్న మహిళలు

ప్రజాశక్తి -అనంతగిరి : మండలంలోని లుంగపర్తి పంచాయతీ పెద్దబయలు గ్రామంలో తాగునీటి సమస్య తక్షణమే పరిష్కరించాలని గిరిజన మహిళలు ఆందోళన చేపట్టారు. పాడైన తాగునీటి పథకం బోరు మోటారుకు మరమ్మతు చేయించి,నీటి ఎద్దడి నివారించాలని డిమాండ్ చేశారు. ఆదివారం నీరివ్వని బోరు వద్ద ఖాళీ బిందెలతో స్థానిక గిరిజన మహిళలు నిరసన చేపట్టారు ఈ సందర్భంగా స్థానిక గిరిజన మహిళలు సోములమ్మ, సింహాచలం మాట్లాడుతూ, తమ గ్రామంలో ప్రజలకు తాగునీటి సౌకర్యం కల్పనకు రెండేళ్ల క్రితం బోరు తవ్వించి,దానికి మోటారు బిగించి దాహార్తిని తీర్చేందుకు సంబంధిత అధికారులు చర్యలు చేపట్టారన్నారు. గ్రామంలో ప్రజల తాగునీటి అవసరాలను తీర్చేందుకు ఈ బోరు ఒక్కటే ఆధారమన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో తరచూ ఈ బోరు మరమ్మతుకు గురవ్వడంతో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పాడైన ప్రతిసారీ రోజుల తరబడి తాగునీటికి కటకటలాడక తప్పడం లేదన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పాడైన బోరుకు మరమ్మతులు చేయించి, తాగునీటి అవసరాలను తీర్చాలని కోరుతున్నారు. నిరసనలో గిరిజన మహిళలతోపాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన

శంకుస్థాపన చేస్తున్న వైస్ ఎంపిపి కొండలరావు

ప్రజాశక్తి -హుకుంపేట: మండలంలోని గన్నేరు పుట్టు పంచాయితీ కంగారు మామిడి, గెడ్డవలస గ్రామాల మధ్య రోడ్డు నిర్మాణ పనులను హుకుంపేట వైస్ ఎంపిపి సూడిపల్లి కొండలరావు ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం, మండల పరిషత్ నిధులతో రోడ్లు వేస్తున్నామన్నారు. మండలంలోని అన్ని గ్రామాలకు రహదారులు, తాగునీరు, ఇతర సౌకర్యాల కల్పనకు కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో గన్నేరుపుట్టు సర్పంచ్ సోకేలి కృష్ణారావు, చీకుమద్దుల సర్పంచ్ సూకూరు బొంజన్న దొర, మెరకచింత పంచాయతీ మాజీ సర్పంచ్, సిపిఎం మండల కార్యదర్శి వలసనైని లక్ష్మణరావు, గన్నేరుపుట్టు మాజీ సర్పంచ్ సూడిపల్లి లక్ష్మీ ప్రమీల, వైస్ సర్పంచ్ మజ్జి మత్స్య రాజు, వార్డు సభ్యులు మజ్జి రాజానాయుడు, వలసనైని వంశీ, జన్ని విజయ్‌కుమార్, పీసా ప్రెసిడెంట్ జంగిడి రాజారావు, గ్రామపెద్దలు జంగిడి వెంకటరావు, దూసూరు కర్రన్న, స్థానిక యువత పిబి.బాలాజీ, వై సింహాద్రి, మహిళలు బాలమ్మి, నాగమణి, చిన్నమ్మి, పార్వతమ్మ పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

శిథిలావస్థలో పెట్రాయి పాఠశాల భవనం

- ఎప్పుడు కూలిపోతుందోనని భయాందోళనలో విద్యార్థులు
- కొత్త భవనం నిర్మాణం చేపట్టాలని తల్లిదండ్రుల డిమాండ్

స్లాబ్, గోడలు పెచ్చులూడిపోయిన శిథిలమైన ఉన్న పెట్రాయి పాఠశాల భవనం ఇదే..

ప్రజాశక్తి -సీలేరు

జికె వీధి మండలం దారకొండ పంచాయతీ పరిధి పెట్రాయి గ్రామంలోని మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకుంది. ఈ పాఠశాలలో సుమారు 50 మంది పిల్లలు విద్యాభ్యాసం చేస్తున్నారు. పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో ఎప్పుడు కూలిపోతుందో, ఏ క్షణంలో ఏం జరుగుతుందోనని భయాందోళనతో విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ చదువులు వెల్లదీస్తున్నారు. కోట్ల రూపాయలు వెచ్చిన ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా తీర్చిదిద్దినట్లు రాష్ట్ర ప్రభుత్వం గొప్పలు చెప్పడం తప్ప ఆచరణలో అటువంటి పరిస్థితి గిరిజన ప్రాంతంలో కానరావడం లేదు. నాడు-నేడు పనుల్లో భాగంగా పెట్రాయి పాఠశాల భవనం నిర్మాణానికి ఎటువంటి చర్యలు చేపట్టకపోవడంతో గ్రామస్తుల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు దృష్టి సారించి పెట్రాయి గ్రామంలోని పాఠశాలకు నూతన భవనం నిర్మించి విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా చర్యలు తీసుకోవాలని విద్యార్థులు తల్లిదండ్రులు డిమాండ్ చేశారు.

పివిటిజిల ఇళ్ల నిర్మాణానికి నిధులు పూర్తిస్థాయిలో జమ చేయాలి

ప్రజాశక్తి -సీలేరు

ప్రధానమంత్రి జన్‌మన్ పథకం కింద ఏజెన్సీలోని ఆదిమజాతి తెగలు (పివిటిజి) ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసి, లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయాలని గాలికొండ ఎంపీటీసీ సభ్యులు అంపరంగి బుజ్జిబాబు డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ జీకే వీధి మండల గాలికొండ పంచాయతీ పరిధిలో జన్‌మన్ పథకంలో అర్హులైన 446 మందికి ఇళ్లు మంజూరు చేసినట్లు చెప్పారు. కేంద్ర ప్రభుత్వం వెనుకబడిన తెగల వారి ఇళ్ల నిర్మాణానికి ముందస్తుగానే కొంతమంది లబ్ధిదారులకు రూ.70వేలు చొప్పున వారి అకౌంట్లో జమ చేయగా, మరికొంత మంది ఖాతాల్లో ఈ రూ.70 వేలు జమ కాలేదని పేర్కొన్నారు. పివిటిజిలందరూ జియో టాకింగ్ చేసి డబ్బులు కోసం ఆశతో ఎదురు చూస్తున్నారని తెలిపారు. ఇళ్లు మంజూరు కావడంతో ముందస్తుగానే వారి ఇళ్లను పడగొట్టి స్థలం లెవెల్ చేసుకోవడం జరిగిందని చెప్పారు. ఇప్పటికీ వారి ఖాతాల్లో ప్రభుత్వం సొమ్ము జమ చేయకపోవడంతో వారంతా నిరాశతో ఉన్నారని తెలిపారు. వెంటనే ప్రభుత్వం, అధికారులు స్పందించి అందరి ఖాతాల్లో సొమ్ము జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలని బుజ్జిబాబు డిమాండ్ చేశారు.

గాలికొండ పంచాయతీ పరిధిలోని పివిటిజి గిరిజనులు

టిడిపిలో చేరిన వైసిపి సర్పంచ్

ప్రజాశక్తి-రంపచోడవరం

వైసిపికి చెందిన గంగవరం మండలం, గంవరం పంచాయతీ సర్పంచ్ కలుముల అక్కమ్మ, వార్డు మెంబర్ కర్రం లక్ష్మి ఆదివారం టిడిపిలో చేరారు. వారికి మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి టిడిపి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

సర్పంచ్‌కు టిడిపి కండువా వేస్తున్న మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి-మారేడుమిల్లి

మారేడుమిల్లి మండలం వేజువాడ గ్రామ సమీపం వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బైకు టైర్ పంచరైయి అదుపుతప్పి కింద పడి ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.... కాకినాడ జిల్లా తుని గ్రామానికి చెందిన సిద్దిరెడ్డి పవన్ రత్నాకర్ (22) అనే యువకుడు వైజాగ్‌లోని ఓ ప్రైవేట్ కంపెనీల్లో ఉద్యోగం చేస్తున్నాడు. శనివారం రాజమహేంద్రవరంలోని తన స్నేహితుల ఇంటికి వెళ్తానని తల్లిదండులకు చెప్పి, మరో ఇద్దరు స్నేహితులతో కలిసి రెండు బైకులపై మండలంలోని పర్యాటక ప్రదేశమైన గుడిసె హిల్ టాప్ తిలకించడానికి వచ్చారు. అనంతరం ఆదివారం ఉదయం తిరిగి వెళ్తుండగా మండలంలోని వేజువాడ గ్రామం సమీపం వద్ద పవన్ బైకు ఒక్కసారిగా టైర్ పంచరై అదుపు తప్పి పడిపోయింది. ఈ ప్రమాదంలోపవన్ రత్నాకర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఆయన్ను బోదులూరు పీహెచ్సీకి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు వెల్లడించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తంర రంపచోడవరం ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాము తెలిపారు.

మహిళా సాధికారతతోనే రాష్ట్రాభివృద్ధి

ప్రజాశక్తి-దేవరాపల్లి : మహిళా సాధికారత ద్వారానే ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి సాధ్యమని వైసిపి మహిళా విభాగం జిల్లా అధ్యక్షులు ఈర్లె అనురాధ అన్నారు. మండలంలోని తారువలో ఆదివారం జరిగిన వైసిపి మహిళా విభాగం జిల్లా సమీక్షా సమావేశంలో అనురాధ మాట్లాడుతూ మహిళలు తమ కాళ్లపై తాము నిలబడేందుకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నామినేటెడ్ పదవుల్లో 50శాతం మహిళలకు కేటాయించినట్లు చెప్పారు. ప్రత్యక్ష ప్రయోజన బదిలీ ద్వారా 3,43,02,005 మంది మహిళా లబ్ధిదారులకు రూ.95,867.10 కోట్లు, ప్రత్యక్ష ప్రయోజన బదిలేతర 30,76,018 మంది మహిళా లబ్ధిదారులకు రూ.75,670.05 కోట్లు ఖర్చు చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి, వైసిపి జిల్లా అధ్యక్షులు బొడ్డేడ ప్రసాద్, దేవరాపల్లి, మాడుగుల, కోటపాడు మండలాల వైసిపి అధ్యక్షులు, మహిళా విభాగం నాయకులు పాల్గొన్నారు.

300 మందికి కంటి పరీక్షలు

ప్రజాశక్తి-అచ్యుతాపురం : బ్రాండిక్స్ ఇండియా అపెరల్ సిటీ (బీఐఏసీ) ఆవరణలో ఆదివారం నిర్వహించిన 121వ ఉచిత కంటి వైద్య శిబిరంలో 300 మంది రోగులకు నేత్ర వైద్యులు కంటి పరీక్షలు నిర్వహించారు. కంటి పరీక్షలు అనంతరం 212 మందికి ఉచితంగా అద్దాలు, 89 మందికి మందులు అందజేశారు. 25మందికి కేటరాక్ట్ సర్జరీ చేయించుకోవాల్సిందిగా వైద్యులు సూచించారు. ఈ కార్యక్రమానికి వచ్చినవారికి మజ్జిగ, పలహారాలు, భోజనం సదుపాయం బ్రాండిక్స్ యాజమాన్యం కల్పించింది. ఈ సందర్భంగా బ్రాండిక్స్ ఇండియా అపెరల్ సిటీ ఇండియా పార్టనర్ దొరస్వామి మాట్లాడుతూ బ్రాండిక్స్ సామాజిక ఆరోగ్య సంరక్షణ కార్యక్రమంలో భాగంగా ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహిస్తుందని చెప్పారు.

పద్మశాలి సంక్షేమ సంఘం కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-చోడవరం రూరల్ : మండల కేంద్రంలోని పద్మశాలి సంక్షేమ సంఘం భవనంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. అధ్యక్షులుగా సప్పా కొండలరావు, ఉపాధ్యక్షులుగా పప్పు శ్రీను, కార్యదర్శిగా కోసూరి నారాయణరావు, సంయుక్త కార్యదర్శి-1గా వంక సూర్యనారాయణ, సంయుక్త కార్యదర్శి-2గా దొడ్డి సత్యనారాయణ, కోశాధికారిగా నేమాల హరితో పాటో మరో 20 మంది సభ్యులుగా ఎన్నికయ్యారు. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర పద్మశాలి సంఘం ప్రధాన కార్యదర్శి పప్పు రాజారావు, నాయకులు ఋషిబాబు మాట్లాడారు. సమావేశంలో భవిష్యత్తు కార్యాచరణను నిర్ణయించుకున్నారు. కార్యక్రమంలో చోడవరం టౌన్, గాంధీ గ్రామం, నరసయ్యపేట ప్రాంతాలలో ఉన్న పద్మశాలి సమాజిక తరగతికి చెందిన వారు పాల్గొన్నారు.

'సంపతిపురం లే-అవుట్ నిర్మాణాలపై సమగ్ర విచారణ జరిపించాలి'

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి మండలం అచ్చయపేట గ్రామాన్ని అనుకొని ఉన్న సంపత్‌పురం లేఅవుట్ 2/2లో జరుగుతున్న 303 ఇళ్ల నిర్మాణాలపై సమగ్ర విచారణ జరిపించాలని సిపిఐ అనకాపల్లి జోనల్, మండల కార్యదర్శులు వైఎన్.భద్రం, చెల్లూరు నాగరాజు ఆదివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పత్రికల్లో కథనాలు వచ్చిన నేపథ్యంలో లబ్ధిదారులు పట్టాలను, అక్రమాల్లో అధికారుల పాత్రను సమగ్రంగా విచారణ జరిపించాలని, అక్రమాలకు పాల్పడిన వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని కోరారు. అధికార పార్టీని అడ్డం పెట్టుకొని, అధికారులను లొంగదీసుకుని అక్రమాలకు పాల్పడుతూ కోట్ల రూపాయల అర్జించిన వారిపై చర్యలు తీసుకోకుంటే సిపిఐ ప్రత్యక్ష ఆందోళనకు పూనుకుంటుందని హెచ్చరించారు.

సామాజిక భవనం నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-సీతమ్మధార: జివిఎంసి 53వ వార్డు పరిధి నరేంద్రనగర్‌లో రూ.50 లక్షలతో రెండు అంతస్తులు నూతన సామాజిక భవనం నిర్మాణానికి వార్డు కార్పొరేటర్ బర్కత్ అలి ఆధ్వర్యాన ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా వైసిపి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎఇ రత్నాకర్, వైసిపి నాయకులు కృష్ణారావు మాస్టర్, అమర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అమృత ఆహారం పండించి ఆరోగ్యంగా జీవించండి

ప్రజాశక్తి-వేపగుంట : అమృత ఆహారం పండించి ఆరోగ్యంగా జీవించాలని డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ పిలుపునిచ్చారు. గో ఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం ఆధ్వర్యాన సింహాచలం గోశాలలో కూరగాయల మొక్కలకు అంట్లు కట్టే శిక్షణా కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. కూరగాయ మొక్కలకు అంట్లు కట్టడం ద్వారా అధిక దిగుబడి సాధించవచ్చని శ్రీధర్ చెప్పారు.

ఎమ్మెల్యే ధర్మశ్రీకి టికెట్ ఇవ్వొద్దంటూ నినాదాలు

ఇవ్వాలంటూ మరో గ్రూపు ఆందోళన
విశాఖ డెయిరీ వేదికగా తోపులాట

ప్రజాశక్తి -గాజువాక : చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీకి వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో టికెట్ ఇవ్వొద్దని ఒక గ్రూపునకు చెందిన వారు రాష్ట్ర ఐటి శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ముందే నినదించారు. మరో గ్రూపు సభ్యులు టికెట్ ఇవ్వాలని నినదించారు. దీనికి విశాఖ డెయిరీ వేదికైంది. పెద్ద పెద్ద కేకలు, అరుపులతో విశాఖ డెయిరీ మార్మోగింది. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీకి ఎమ్మెల్యే టికెట్ ఇవ్వరాదని కోరుతూ బుచ్చయ్యపేట మండలానికి చెందిన విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ వివిధ సందర్భాల్లో బహిరంగంగా చెబుతూ వస్తున్నారు. గతంలో గేదెల సత్యనారాయణ టిడిపిలో ఉండేవారు. విశాఖ డైరీ చైర్మన్ ఆడారి ఆనంద్ కుమార్ వైసిపిలోకి వచ్చిన తర్వాత ఆయన కూడా ఆ పార్టీలో చేరారు. అయినా సరే ధర్మశ్రీకి వ్యతిరేకంగానే పనిచేశారని ధర్మశ్రీ వర్గీయులు ఆరోపిస్తున్నారు. ఎన్నికలు దగ్గర పడుతున్న సమయంలో గ్రూపు రాజకీయాలు ఉండరాదని మంత్రి అమర్‌నాథ్ సమక్షంలో విశాఖ డెయిరీ లోపల ఆదివారం పంచాయితీ ఏర్పాటుచేశారు. మంత్రి అమర్‌నాథ్, ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ, ఆడారి ఆనంద్‌కుమార్, మండలానికి చెందిన ఎంపిటిసిలు, జడ్‌పిటిసి సభ్యులు రాంబాబు హాజరయ్యారు. కర్ణం ధర్మశ్రీకి ఎమ్మెల్యే టికెట్ ఇవ్వాలని జడ్‌పిటిసి సభ్యులు రాంబాబు పట్టుబట్టారు. గేదెల సత్యనారాయణతో పాటు మరో ఎంపిటిసి సభ్యుడు ధర్మశ్రీకి వ్యతిరేకంగా మాట్లాడారు. ఈ క్రమంలో జడ్‌పిటిసి గ్రూపునకు, గేదెల సత్యనారాయణ గ్రూపునకు మధ్య వివాదం చోటుచేసుకుంది. ఇరు గ్రూపులు కేకలు వేసుకున్నారు. ఒకరినొకరు చొక్కాలు పట్టుకుని తోసుకున్నారు. వివాదం పెద్దది కావడంతో విశాఖ డెయిరీ సెక్యూరిటీ సిబ్బంది కల్పించుకొని వారందరినీ బయటికి పంపించేశారు.

శ్రీకృష్ణదేవరాయలు, వంగవీటి విగ్రహావిష్కరణలు

సమావేశంలో మాట్లాడుతున్న బొత్స ఝాన్సీ

ప్రజాశక్తి -గోపాలపట్నం : జివిఎంసి 92వ వార్డు పరిధి పద్మనాభనగర్‌లో శ్రీకృష్ణదేవరాయలు, వంగవీటి మోహనరంగా విగ్రహాలను రాజ్యసభ సభ్యులు వైవి సుబ్బారెడ్డి, మాజీ ఎంపీ బొత్స ఝాన్సీ, వైసిపి పశ్చిమ నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ ఆదివారం ఆవిష్కరించారు. కాపుల అభివృద్ధికి వారు చేసిన కృషిని వక్తలు కొనియాడారు. అనంతరం పద్మనాభనగర్‌లో రూ.2 కోట్లతో నిర్మిస్తున్న కాపు కల్యాణ మండపాన్ని పరిశీలించారు. జివిఎంసి 90వ వార్డులో రూ.2.30 కోట్లతో వెంకటేశ్వర స్వామి ఆలయం నిర్మాణాన్ని త్వరలో చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు విజయప్రసాద్, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, కో ఆప్షన్ సభ్యులు బెహరా భాస్కరరావు, శ్రీకృష్ణదేవరాయ కాపు, తెలగ, బలిజ సంక్షేమ సంఘ సభ్యులు, 91, 92 వార్డుల అధ్యక్షులు గుణిశెట్టి శ్రీనివాసరావు, గొర్రె అప్పలస్వామి నాయుడు, నాయకులు గేదెల మురళీకృష్ణ, బండారు వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బాలలే దేశ సంపద

ప్రజాశక్తి -ములగాడ : బాలలే దేశ సంపద అని, వారు ఆరోగ్యంగా, ఆనందంగా ఉండడంపైనే దేశ అభివృద్ధి ఆధారపడి ఉంటుందని సెయింట్ ఆన్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిస్టర్ ప్రేమకుమారి అన్నారు. తాటిచెట్లపాలెం, కంచరపాలెంలోని మురికివాడల వీధి బాలలు, బిపిఎల్ కుటుంబాలకు చెందిన చిన్నారులను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ, మురికి వాడల్లో నివసించే చిన్నారుల చదువుపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. వారిని ఆదుకోవడానికి స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని కోరారు. ఈ సందర్భంగా డాన్‌బాస్కో నవజీవన్ సంస్థకు చెందిన డైరెక్టర్ ఫాదర్ అరుల్ దాస్, ఫాదర్ కల్యాణ్‌బాబు మాట్లాడుతూ, మురికివాడల్లో నివసిస్తున్న బాలల ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకోవాలని, స్వచ్ఛంద సంస్థలు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించాలని కోరారు. బాలలు వ్యక్తిగత పరిశుభ్రతకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి జాతీయ సేవా పథకం సీనియర్ ప్రోగ్రాం అధికారి వై.అనసూయాదేవి, వారు తీసుకోవాల్సిన పౌష్టికాహారం గురించి అధ్యాపకులు వలీషా ప్రసంగించారు. అనంతరం కళాశాలలో ఇటీవల నిర్వహించిన చారిటీషోల ద్వారా వచ్చిన ఆదాయంతో సుమారు 150 మందికి స్కూలు యూనిఫాం, టీ షర్టులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిస్టర్ సంధ్య, సెయింట్ ఆన్స్ కళాశాల విద్యార్థినులు, డాన్ బాస్కో సిబ్బంది పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

ప్రజాశక్తి-పెందుర్తి : 2004లో వేపగుంట హైస్కూల్లో పదోతరగతి చదివి వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు ఆదివారం పాఠశాల ఆవరణలో కలుసుకున్నారు. హరె.. ఒరె.. అంటూ ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఎవరెవరు ఏ పనులు చేస్తున్నారో చర్చించుకున్నారు. సంవత్సరానికి ఒక్కసారి అయినా అందరమూ కలవాలని నిర్ణయించుకునానరు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థి సౌజన్య మాట్లాడుతూ, స్నేహానికి వృత్తులు అడ్డుకావన్నారు. మన స్నేహం అందరికీ స్ఫూర్తి కావాలన్నారు. సంవత్సరానికి ఒక్కసారైనా వనభోజన కార్యక్రమం ఏర్పాటుచేసుకుందామని సూచించారు.

వేపగుంట హైస్కూల్లో కలుసుకున్న 2004 బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు

నేరాలు ఘోరాలు

యువకునిపై కేసు

ప్రజాశక్తి - ఆరిలోవ : వాహన తనిఖీలు చేస్తున్న ట్రాఫిక్ ఎస్ఐని కారుతో ఢీకొట్టిన ఘటనలో యువకునిపై ఆరిలోవ పోలీసులు కేసు నమోదు చేశారు. దీనికి సంబంధించి ఆరిలోవ పోలీసుల కథనం ప్రకారం... విశాఖ వేలీ స్కూలు వద్ద ఆరిలోవ ట్రాఫిక్ ఎస్ఐ ఆధ్వర్యాన శనివారం రాత్రి వాహన తనిఖీలు చేస్తున్నారు. ఈ క్రమంలో పెదవాల్తేరుకు చెందిన యువకుడు వాహనం ఆపకుండా ముందుకు దూసుకు వెళ్లిపోయాడు. ఈ క్రమంలో ఆరిలోవ ట్రాఫిక్ ఎస్ఐపైకి దూసుకు రావడంతో కాలుకు చిన్నపాటి గాయాలయ్యాయి. ఆదివారం కారును గుర్తించారు. కారు నడిపిన వ్యక్తి పెదవాల్తేరుకు చెందిన వెంకట్‌గా గుర్తించి, కారును సీజ్ చేసి ఆయనపై కేసు నమోదు చేశారు.

43 మద్యం బాటిళ్లు స్వాధీనం

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మండలంలోని పూడిమడక శివారు కొండపాలెం గ్రామంలో ఆంజనేయ స్వామి ఆలయ ఆవరణలో శనివారం రాత్రి 43 మద్యం సీసాలను పోలీసులు పట్టుకున్నారు. మద్యం విక్రయిస్తున్న ఆ గ్రామానికి చెందిన గనగళ్ల ముత్యాలును అరెస్టు చేసి, మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు అచ్యుతాపురం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం.బుచ్చిరాజు తెలిపారు. పట్టుబడిన మద్యం సీసాలు విలువ రూ.5445 ఉంటుందని చెప్పారు.

పల్సర్ బైక్ అపహరణ

ప్రజాశక్తి-వడ్డాది : బుచ్చయ్యపేట మండలం ఎల్బీపీ అగ్రహారం గ్రామంలో శనివారం అర్ధరాత్రి పల్సర్ బైక్ అపహరణకు గురైంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... ఎల్‌బిపి.అగ్రహారంలోని విశ్వబ్రాహ్మణ సామాజిక తరగతికి చెందిన నక్క నర్సింగరావు పల్సర్ బైక్‌ను జనవరి 3వ తేదీని కొనుగోలు చేశారు. నరసింగరావు మెయిన్ రోడ్డును ఆనుకొని ఉన్న తన ఇంటి ముందునే శనివారం రాత్రి పార్కింగ్ చేసి నిద్రిస్తుండగా, అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఆ బైక్‌ను అపహరించుకుపోయారు. ఆదివారం తెల్లవారు లేచి చూసేసరికి పార్కింగ్ చేసిన బైక్ లేకపోవడంతో లబోదిబోమంటూ బుచ్చయ్యపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఏఎస్ఐ నాయుడు సంఘటన స్థలానికి చేరుకొని కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఇది ఇలా ఉండగా రాత్రి పూట స్థానిక యువకులు గ్రామ వీధుల్లో సంచరించడం పలు అనుమానాలకు దారితీస్తుంది

'బౌద్ధం ద్వారా అసమానతలు దూరం'

ప్రజాశక్తి-సీతమ్మధార : బౌద్ధ ధర్మం ద్వారా అసమానతలు దూరం చేయొచ్చని పలువురు బౌద్ధ మేధావులు పేర్కొన్నారు. నగరంలోని బుల్లయ్య కాలేజీ సమీపంలోని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ భవన్‌లో ఆదివారం ది బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యాన 11వ బౌద్ధ మహా సమ్మేళనాన్ని నిర్వహించారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి బౌద్ధులు పెద్ద సంఖ్యలో హాజరై గౌతమ్ బుద్ధుడు, డాక్టర్ బిఆర్. అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. డాబాగార్డెన్స్‌లోని అంబేద్కర్ విగ్రహం నుంచి అంబేద్కర్ భవన్ వరకు దమ్మ జ్యోతి ర్యాలీ నిర్వహించారు. బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు వై.హరిబాబు అధ్యక్షతన జరిగిన ఈ సమ్మేళనంలో డాక్టర్ అయూపాల మహతెరో (మయన్మార్) సారిపుత్ర ధర్మ ప్రబోధన చేశారు. వీసీకే అధ్యక్షుడు జిలుకర శ్రీనివాస్, వాగ్గేయకారుడు మచ్చ దేవేందర్, బాంసెఫ్ జాతీయ నాయకుడు నల్లా గంగాధర్, బౌద్ధ రచయిత డి.నటరాజ్ సాఖ్య, అంబేద్కర్ మెమోరియల్ సొసైటీ అధ్యక్షుడు బొడ్డు కల్యాణరావు ప్రసంగించారు.

వైసిపి మహిళా విభాగం జిల్లా ఉపాధ్యక్షులుగా జ్యోతి

ప్రజాశక్తి - కశింకోట: కశింకోట మండల పరిషత్తు ఉపాధ్యక్షులు పెంటకోట జ్యోతి వైసిపి మహిళా విభాగం జిల్లా ఉపాధ్యక్షులుగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా జ్యోతి ఆదివారం విలేకర్లతో మాట్లాడుతూ పార్టీని బలోపేతం చేయడానికి కృషి చేస్తానన్నారు. మహిళా అన్ని రంగాల్లో రాణించాల్సి ఉందని చెప్పారు. తనను వైసిపి మహిళా విభాగం జిల్లా ఉపాధ్యక్షులుగా ఎంపిక చేయడం పట్ల ధన్యావాదాలు తెలిపారు.

ఆందోళన చేపట్టిన టిడిపి కార్యకర్తలు

పీలా గోవింద్‌కు టికెట్ ఇవ్వాలని ఆందోళన

కశింకోట : అనకాపల్లి అసెంబ్లీ నియోజకవర్గం టిడిపి టికెట్‌ను మాజీ ఎమ్మెల్యే పీలా గోవిందా సత్యనారాయణకు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఆదివారం మండల కేంద్రం కశింకోటలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఆందోళన చేపట్టారు. నల్ల రిబ్బన్లతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ నియోజకవర్గానికి అనేక సేవలు అందించిన పీలా గోవిందకు టికెట్ ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. ఏ గ్రామానికి వెళ్ళినా పేరు పెట్టే కార్యకర్తలను పిలుస్తారని, అటువంటి వ్యక్తిని, కార్యకర్తలు మనోభావాలను కాదని జనసేనకు ఎమ్మెల్యే టికెట్ ఇవ్వడం సరికాదన్నారు. అనకాపల్లి ఎమ్మెల్యే టిడిపికి, ఎంపీ టికెట్ జనసేనకు కేటాయించాలని కోరారు. పీలా గోవిందకు టికెట్ ఇవ్వకుంటే రాజీనామా చేయడానికి సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఉగ్గని రమణమూర్తి, పెంటకోట రాము, సిదిరెడ్డి శీను, బుధిరెడ్డి గంగయ్య, వేగి గోపికృష్ణ, కాండ్రేగులు సతీష్, కలగ సోమేశ్వరరావు, సీరంశెట్టి వెంకటలక్ష్మి, కొతం ఈశ్వరమ్మ, మళ్ల లోవకృష్ణ, వేగి వెంకటరావు, సిదిరెడ్డి సూర్యనారాయణ పాల్గొన్నారు.

రాజేష్‌ను సత్కరిస్తున్న ఐద్వా జాతీయ నాయకులు

ఫొటో జర్నలిస్టు రాజేష్‌కు సత్కారం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఇటీవల జాతీయ స్థాయిలో ఉత్తమ ఫొటోగ్రాఫర్‌గా అవార్డు దక్కించుకున్న ప్రజాశక్తి ఫొటో జర్నలిస్టు కె.రాజేష్‌ను ఐద్వా నాయకులు సత్కరించారు. ఆదివారం అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఐద్వా జాతీయ అధ్యక్షురాలు పిఆర్.శ్రీమతి, ప్రధాన కార్యదర్శి మరియం ధావలే రాజేష్‌ను సత్కరించి జ్ఞాపక అందజేశారు. కార్యక్రమంలో సంఘం జాతీయ కోశాధికారి ఎస్.పుణ్యవతి, రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు బి.ప్రభావతి, డి.రమాదేవి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.పద్మ, వై.సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

ఆశాజనకంగా జనుము

ప్రజాశక్తి -కోటవురట్ల : ప్రస్తుత రబీ సీజన్‌లో మండల వ్యాప్తంగా పలు గ్రామాలలో సాగులో ఉన్న జనుము పంట ఆశాజనకంగా ఉంది. ఏజెన్సీ ప్రాంతాన్ని తలపించే విధంగా వలిసె పువ్వుల అందాలు మైదానంలోనూ మంత్రముగ్ధులను చేస్తున్నాయి. రోడ్డుకు ఇరువైపులా సాగు చేస్తున్న జనుము పంట ఆహ్లాదకరంగా దర్శనం ఇవ్వడంతో ప్రయాణికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు, మండల వ్యాప్తంగా దాదాపుగా అన్ని గ్రామాల్లో సాగులో ఉన్న జనుము పంట ప్రస్తుతం పూత దశలోఉంది. జనుము సాగుతో ప్రస్తుతం ఆదాయంతోపాటు వచ్చే ఖరీఫ్ సీజన్‌కు భూమి సారవంతమవుతుందని రైతులు అంటున్నారు. అకుపచ్చ, పసుపు పూల కలయికతో నేలంతా పరుచుకున్న వలిసె పూల అందాలు ప్రకృతి ప్రేమికులను తన్మయులను చేయడంతోపాటు రైతులకు మంచి ఆదాయాన్ని చేకూర్చేందుకు పైర్లు ఆశాజనకంగా ఉండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఉద్యమాల్లో జయగోపాల్ పాత్ర మరువలేనిది

జయగోపాల్ చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని ఉద్యమాల్లో జయ గోపాల్ ప్రభావం ఎంతో ఉందని, మూఢ విశ్వాసాలకు వ్యతిరేకంగా ఆయన అలుపెరుగని పోరాటం చేశారని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి.సత్యనారాయణమూర్తి అన్నారు. సాంఘిక ఉద్యమకారుడు డాక్టర్ జయ గోపాల్ సంస్మరణ సభ ఆదివారం అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో భారత నాస్తిక సమాజం, సైంటిఫిక్ స్టూడెంట్ ఫెడరేషన్ నేతృత్వంలో నిర్వహించారు. సభలో సత్యనారాయణమూర్తి ప్రసంగిస్తూ తెలుగు నాట ముగ్గురు గోపాల్‌లులో జయ గోపాల్ ఆనాడు సమాజాన్ని ప్రభావితం చేశారన్నారు. ఒకప్పుడు సామాజిక కార్యక్రమాలలో యువత ఉండేదని, నేడు అది కరువైందని విచారం వ్యక్తం చేశారు. ఆయన లేకపోయినా ఉద్యమం ఉందని, దానిని మరింతగా ముందుకు తీసుకుపోవాలని అన్నారు. జయ గోపాల్ తన కుటుంబ సభ్యులందరినీ ఆ దిశగా తీసుకుని వెళ్లారని, దానిని ఉద్యమంలో ఉన్న వారు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. చెన్నయ్ నుంచి విచ్చేసిన ద్రవిడ కజగం నేత వీరమణి కుమారుడు వి.అంబురాజు ప్రసంగిస్తూ జయగోపాల్ సాంస్కృతిక, సాంఘిక విప్లవకారుడని, తెలుగు రాష్ట్రాల్లోని యువతకు ఎంతో స్ఫూర్తిదాయకమని అన్నారు. తెలుగు రాష్ట్రాల్లో ఉద్యమం చేపట్టడమే కాకుండా తమిళనాడులో కూడా ఆనాడు పెరియర్‌తో కలిసి పని చేశారని గుర్తు చేశారు. విశాఖలోని బీచ్ రోడ్డులో పెరియార్ విగ్రహం ఏర్పాటుకు జయ గోపాల్ కృషి మరువలేనిదన్నారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ మాట్లాడుతూ మత, కులతత్వంపై ప్రశ్నించేతత్వాన్ని యువతకు అలవర్చాల్సిన అవసరం ఉందన్నారు. జయ గోపాల్ చెప్పిన సాంస్కృతిక విప్లవం ఎంత అవసరమో నేటి పరిస్థితులు తెలియజేస్తున్నాయని, ఆ దిశగా ఉద్యమించడమే జయ గోపాల్‌కి ఇచ్చే నివాళి అని అన్నారు. కార్యక్రమంలో లీడర్ సంపాదకులు వివి.రమణమూర్తి, భారత నాస్తిక సమాజం రాష్ట్ర అధ్యక్షులు టి.శ్రీరామమూర్తి,. మహిళా చేతన ప్రధాన కార్యదర్శి కత్తి పద్మ, దళిత సేన రాష్ట్ర నాయకులు పాల్తేటి పెంటారావు, చైతన్య మహిళా సంఘం అధ్యక్షురాలు డి.లలిత, న్యాయవాది గంటా మోహనరావు పాల్గొన్నారు.

ప్రాధాన్యతా భవనాలకు వెళ్లేదెలా.?

రహదారి కల్పనలో నిండా నిర్లక్ష్యం
ప్రారంభోత్సవాలకు అదే అడ్డంకి
పట్టించుకోని అధికారులు, నేతలు

దారిలేని చోట కొండవాలులో నిర్మించిన ప్రభుత్వ భవనాలు

ప్రజాశక్తి -కోటవురట్ల : మండలంలో పందూరు గ్రామంలో ప్రభుత్వం ఆర్భాటంగా రూ.లక్షలు వెచ్చించి రైతు భరోసా, ఆరోగ్య కేంద్రాల నిర్మాణం చేపట్టారు. ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత భవనాలుగా చెప్పుకునే వీటి వద్దకు వెళ్లే దారి సంగతి మాత్రం మరిచారు.దీంతో ఇక్కడ నిర్మించిన భవనాలు దాదాపు రెండేళ్ల క్రితమే పూర్తయినా నేటికీ భవనాల వద్దకు వెళ్లే దారి సక్రమంగా లేక ఇబ్బందులు పడే పరిస్థితి ఉంది. వ్యవసాయ సేవలకు రైతుభరోసా కేంద్రాలకు వెళ్లే దారిలేక రైతన్నలు ఆందోళన చెందుతున్నారు, అలాగే ఆరోగ్య ఉపకేంద్రం నిర్మించి నెలలు గడుస్తున్నా నేటికీ ప్రారంభం కాకపోవడానికి దానికి సరైన దారి లేకపోవడమే ప్రధాన కారణం. అయితే ఇక్కడ దీని నిర్మాణానికి సంబంధించి సంబంధిత కాంట్రాక్టర్‌కు నేటివరకు బిల్లులు చెల్లించకపోవడంతో భవనం అప్పగించకపోవడం మరోకారణంగా తెలుస్తోంది.

ఆయా కేంద్రాలకు వెళ్లేందుకు దారి లేకపోవడంతో, మార్గమధ్యలో ఉన్న కొండవాలు గెడ్డ వద్ద తాత్కాలికంగా నడిచి వెళ్లేందుకు విరిగిన విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశారు,. వాటిపై నుంచి వెళ్లేందుకు ఉద్యోగులు, ప్రజలు భయపడుతున్నారు. వాటిపై నుంచి ఎక్కడ అదుపుతప్పి పడిపోతామేమోనని ఆందోళన చెందుతున్నారు.రైతు భరోసా కేంద్రాల నుంచి ఎరువులు, విత్తనాలను తెచ్చుకోవడంతోపాటు చిన్నపాటి వ్యవసాయ సలహాకైనా రైతుభరోసా కేంద్రానికి వెళ్లాల్సిన పరిస్థితుల్లో సరైన దారి లేకపోవడంతో అక్కడకు వెళ్లే వీలులేక, ఆయా కేంద్రాల సేవలు రైతులకు దూరమౌతున్నాయని ఆరోపణలున్నాయి. దీనిపై నేతలు, అధికారులకు అనేకసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు, స్థానిక నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎప్పటికైనా ప్రభుత్వ యంత్రాంగం స్పందించి, రైతుభరోసా కేంద్రానికి, ఆరోగ్య ఉప కేంద్రానికి సక్రమమైన దారి ఏర్పాటు చేయాలని, మార్గమధ్యలో గెడ్డపై కల్వర్టు నిర్మించాలని స్థానికులు కోరుకుంటున్నారు.

ఆటో బోల్తా : మహిళకు తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-గొలుగొండ : మండలంలోని జోగుంపేట జంక్షన్ వద్ద ఆదివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. నర్సీపట్నం నుండి కృష్ణదేవిపేట వైపు వెళ్తున్న ఆటో, జోగుంపేట జంక్షన్ వద్దకు వచ్చేసరికి ఒక్కసారిగా బోల్తా పడింది. ఈ ప్రమాదంలో నర్సింగబిల్లి గ్రామానికి చెందిన కొరుప్రోలు రమణమ్మ అనే మహిళ తీవ్రంగా గాయపడింది. ఆటోలో ఉన్న మిగతా ప్రయాణికులకు స్వల్ప గాయలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు.

అధ్వాన రోడ్డు వద్ద నినాదాలు చేస్తున్న నాయకులు

రోడ్డును బాగు చేయాలని ఆందోళన

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : దక్షిణ నియోజకవర్గ పరిధిలోని రామకృష్ణ థియేటర్ జంక్షన్, రైతు బజార్ పక్కన ఆర్బర్ పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న రోడ్డుకు మరమ్మతులు చేయాలని సిఐటియు నాయకులు ఎం.సుబ్బారావు ఆధ్వర్యంలో ఆదివారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ చాలా కాలం నుంచి రోడ్లు పూర్తిగా పాడైపోయినప్పటికీ మరమ్మతులకు నోచుకోలేదన్నారు. ఈ రోడ్లపై ద్విచక్ర వాహనంపై ప్రయాణించేవారికి ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. అటు పోర్టుకు, ఇటు చావుల మధుం, కంచరపాలెం, నేవల్ డాక్‌యార్డ్, హెచ్‌పిసిఎల్ వైపు వెళ్లే ప్రధాన రహదారి ఇదని తెలిపారు. కార్యక్రమంలో రిక్షా పుల్లర్స్ యూనియన్ నాయకులు కె.నాగరాజు, నర్సింగరావు, అయ్యన్న, మోటార్ మెకానిక్ వర్కర్స్ యూనియన్ నాయకులు కె.గణేష్, సిఐటియు నాయకులు చంద్రమౌళి, హోటల్ యూనియన్ నాయకులు ఎర్రి బాబు పాల్గొన్నారు

చెట్టును నరికిన వ్యాపారిపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ప్రజలకు నీడ కల్పిస్తూ, స్వచ్ఛమైన గాలి అందిస్తున్న చెట్టును దుకాణానికి అడ్డుగా ఉందని చెప్పి నరికి వేసిన వ్యాపారిపై చర్యలు తీసుకోవాలని సిఐటియు జగదాంబ జోన్ నాయకులు ఎం. సుబ్బారావు డిమాండ్ చేశారు. చెట్టును తొలగించిన ప్రదేశంలో రిక్షా కార్మికులతో కలిసి ఆదివారం ఆయన నిరసన తెలిపారు.

విశాఖ మ్యూజియాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఇటీవల ఆధునికీకరణ పనులు పూర్తి చేసుకొని అందుబాటులోకి వచ్చిన విశాఖ మ్యూజియంను జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున సందర్శించారు. ఆదివారం ఉదయం బీచ్ రోడ్డులో ఫ్లోటింగ్ బ్రిడ్జిని ప్రారంభించిన అనంతరం జీవీఎంసీ కమిషనర్ సిఎం సాయికాంత్ వర్మ, జేసీ కె.మయూర్ అశోక్‌లతో కలిసి మ్యూజియాన్ని కలెక్టర్ సందర్శించారు. కళాకారులు తయారు చేసిన క్రాఫ్ట్, ఆర్టులను పరిశీలించారు.

ఎపి జెఎసి నిర్ణయం సరికాదు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : లక్షలాది మంది ఉపాధ్యాయ, ఉద్యోగుల ఆకాంక్షలకు అనుగుణంగా పోరాటం చేయాల్సిన ఎపి జెఎసి ప్రభుత్వం నుండి ఎటువంటి స్పష్టతా లేకుండానే ఈ నెల 27న నిర్వహించతలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని వాయిదా వేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని యుటిఎఫ్ విశాఖ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దాసరి నాగేశ్వరరావు, టిఆర్.అంబేద్కర్‌లు తెలిపారు. ఈ మేరకు వారు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. సరెండర్ లీవులు, పిఆర్‌సి బకాయిలు తదితర రూ.20 వేల కోట్ల ఆర్థిక బకాయిలు చెల్లింపులపై మినిట్స్ జారీ చేసారే తప్ప ఏ విధమైన ఉత్తర్వులూ ఇవ్వకపోవడం శోచనీయమన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

ప్రజాశక్తి-మాకవరపాలెం : మాకవరపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 1994-95లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక ఆదివారం కోలా కుమార్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు ఒకరినొకరు అప్యాయంగా పలకరించుకుని, యోగక్షేమాలు తెలుసుకున్నారు. అనంతరం అలనాటి జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకుని, ఆనందంగా గడిపారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు.

సమాచార హక్కు చట్టం మహాసభలకు జిల్లా ప్రతినిధులు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్ : నంద్యాల జిల్లా నంద్యాల పట్టణంలో ఆదివారం ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సమాచారహక్కు చట్టం 2005 ద్వితీయ మహాసభలు ప్రారంభమయ్యాయి. ఈ సభలకు అనకాపల్లి జిల్లా ప్రతినిధులు షేక్ జీలానీ, షేక్ షాహిన్ షా తదితరులు హాజరయ్యారు.